క్లుప్తంగా

నేడు దంత వైద్య శిబిరం

కేపీహెచ్‌బీకాలనీ: శ్రీ శివశక్తి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రమ్యాగ్రౌండ్‌లో ఏరియా డెంటల్ చారిటబుల్ ట్రస్ట్ ఆస్పత్రి వారి సౌజన్యంతో ఆదివారం దంత ఉచిత వైద్య శిబిరం ఉంటుందని నిర్వాహకులు కట్టా నరసింగరావు, డా.శ్వేత తెలిపారు. ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. కాలనీవాసులు దంత పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ శ్రీవివేకానంద నగర్‌లోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథుడికి పంచామృత అభిషేకాలు, నూతన వస్త్రాలంకరణ, సామూహిక సాయి సత్యవ్రతాలు చేశారు.

తల్లీకూతురి అదృశ్యం




అనూష, అక్షిత (ఫైల్)

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని వినాయకనగర్‌లో రవి, అనూష దంపతులు నివాసం ఉంటున్నారు. ఈనెల 9వ తేదీన భార్యభర్తలు ఇద్దరూ గొడవపడ్డారు. అనూష (28) తన కూతురు అక్షిత (3)తో కలిసి ఇల్లు వదిలి వెళ్లిపోయింది. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త రవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు..




రక్షాపుల్లర్స్ కాలనీలోని అంగన్‌వాడీ పాఠశాల ఎదుట నేలకు తాకుతున్న తీగలు



మాధవరం కాలనీలో నేలకు సమాంతరంగా ట్రాన్స్‌ఫార్మర్

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి డివిజన్లలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. కంచె లేకుండా విద్యుత్ తీగలు నేలకు తాకుతున్నాయి. ఫ్యూజ్ బాక్స్‌లకు కూడా మూతలు లేవు. పాపిరెడ్డినగర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుకు సమాంతరంగా ఉండటంతో గతేడాది అటుగా వెళ్లిన మూగ జీవాలు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. కాలనీల్లో ఆడుకునే పిల్లలు బాల్ పడితే తీసుకోవడానికి వెళ్తుంటారు. అప్పుడు జరగరానిది ఏమైన జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు స్పందించడం కంటే ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే ఉత్తమమని అధికారులకు చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. – ఆల్విన్‌కాలనీ

చింతలేని అధికారులు



మాధవరంకాలనీ నారాయణ స్కూల్ వద్ద..



ఆల్విన్‌కాలనీ ఫేజ్-1 వార్డు కార్యాలయం వద్ద కంచె లేకుండా..

జోనల్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



మహిళలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న లీగల్ సెల్ అధికారులు

కూకట్‌పల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో శనివారం డీసీ రవికుమార్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించారు. అనంతరం మహిళా ప్రతినిధులను సత్కరించారు. అనంతరం లీగల్ అడ్వకేట్స్, ఎన్‌జీఓలు, షీ టీం సభ్యులు, ఎస్‌హెచ్‌జీ, టీఎల్ఎఫ్‌లతో సమావేశం నిర్వహించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్...

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ, ఎస్ఆర్‌పీలు, స్వచ్ఛ జవాన్లు, రాంకీ వార్డు లెవెల్ ఫీల్డ్ అసిస్టెంట్స్‌తో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ... ఉదయం నుంచే పారిశుద్ధ్య సిబ్బంది పనులను చేపట్టి చెత్తాచెదారాం లేకుండా శుభ్రం చేయాలన్నారు. అదే విధంగా ఉదయం ఇంటికి వచ్చే రిక్షా, ఆటో కార్మికులకు తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలని ప్రజలను కోరారు. యూసీడీ విభాగం డీపీఓలు, మూసాపేట, కూకట్‌పల్లి సర్కిల్ సిబ్బంది సీఓ పాల్గొన్నారు.



ప్రదర్శిస్తున్న చీరలను పరిశీలిస్తున్న అధికారులు

బండి సంజయ్‌పై కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు

కేపీహెచ్‌బీకాలనీ: ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని భారత జాగృతి కూకట్‌పల్లి శాఖ నాయకులు అన్నారు. అతడిపై వెంటనే చర్యలు తీసుకోవాలని శనివారం కేపీహెచ్‌బీ పోలీసులకు వారు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బండి సంజయ్ బేషరతుగా కవితకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

చెరువులో పడి వృద్ధురాలు మృతి

కేపీహెచ్‌బీకాలనీ: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం... హైదర్‌నగర్‌కు చెందిన సదా జీతమ్మ (75) శనివారం సాయంత్రం ఇంట్లోని చెత్తను సమీపంలోని అలీ తలాబ్ చెరువులో పడేసేందుకు వెళ్లింది. వాటిని చెరువులో విసిరివేస్తుండగా కాలు జారి చెరువులో పడి మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బండి వ్యాఖ్యలపై భగ్గుమన్న బీఆర్ఎస్

- కూకట్‌పల్లి జోన్ వ్యాప్తంగా నిరసనలు
- బండి సంజయ్ దిష్టిబొమ్మల దహనం



కూకట్‌పల్లి బస్‌స్టాప్ వద్ద బండి సంజయ్ చిత్రపటాన్ని దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కూకట్‌పల్లి: ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో శనివారం అన్ని డివిజన్లలో బండి సంజయ్ దిష్టిబొమ్మలు దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నోటికి ఏది వస్తే అది మాట్లాడటం సమంజసం కాదన్నారు. సభ్యత, సంస్కారం లేని బండి సంజయ్ లాంటి వ్యక్తులకు మహిళలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఇకనైనా బుద్ధి తెచ్చుకొని వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీకి తొత్తులుగా ఉన్న వారు ఎన్ని అక్రమాలు, అన్యాయాలు చేసినా నోరు మెదపరన్నారు. కానీ బీజేపీని ఎదిరించి మాట్లాడిన వారిపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయన్నారు.



ఫతేనగర్‌లో సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మోతీనగర్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని నీలిమ ఆసుపత్రి ఎండీ డాక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. మూసాపేట డివిజన్ మోతీనగర్ హనుమాన్ దేవాలయం వద్ద శనివారం ఉచిత డయాబెటిస్ వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. నవీన్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 2500 మందికి మధుమేహ పరీక్షలు నిర్వహించారు. అసవరమైన వారికి మందులను అందజేశారు. ప్రతి రోజు వ్యాయామం చేస్తే డయాబెటిస్, బీపీ బారిన పడరన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నీలిమ, సిబ్బంది వెంకటేశ్వర్లు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేస్తాం

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్



భాగ్యనగర్‌కాలనీ: శంషీగూడ మహంకాళినగర్ రోడ్డులో పెండింగ్ పనులను శనివారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీలో సీసీరోడ్డు పనులకు నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే పనులను ప్రారంభిస్తామని తెలిపారు. పెట్రోల్‌బంక్ వెనుక ఉన్న రెండు వీధుల్లో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎస్టిమేషన్ వేయాలని అధికారులకు సూచించారు. కాలనీలో తాగు నీరు రావటం లేదని... వీధి లైట్లు వెలగడం లేదని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. గోదావరి పైపులైన్ మరమ్మతు పనుల కారణంగా రెండు రోజుల నుంచి తాగునీరు సరఫరా నిలిపేసినట్లు తెలిపారు. రేపటి నుంచి యథావిధిగా మంజీరా నీరు సరఫరా అవుతాయని పేర్కొన్నారు. కాలనీలో అవసరమైన చోట వీధి దీపాలను అమర్చాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, శ్రీనివాస్, శ్రీను, అశోక్, మురళి, శేఖర్, బాలామణి, రమాదేవి, పద్మ, లక్ష్మి, రవి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి.. డివైడర్‌ను ఢీకొట్టి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతుడు చరణ్

బాలానగర్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో తీవ్రగాయాల పాలైన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. బాలానగర్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం... చింతలపూడి చరణ్(51) దిల్‌కుషేనగర్‌లో నివాసముంటున్నాడు. దిల్‌కుషేనగర్ నుంచి పద్మారావు నగర్ శనివారం వైపు తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఉదయం స్కూటర్ అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొట్టాడు. తీవ్రగాయాలైన అతడిని స్థానికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి మేనల్లుడు రఘురాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహనీయుల జయంతిని ఘనంగా నిర్వహించుకోవాలి

నిజాంపేట్: ఏప్రిల్ మాసంలో నిర్వహించే మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా శనివారం ప్రగతినగర్ అంబేడ్కర్ సర్కిల్‌లో దళిత బహుజన నాయకులు సమావేశమయ్యారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అంబేడ్కర్ జయంతితో పాటు ఏప్రిల్ 5న బాబు జగ్జీవన్‌రాం, ఏప్రిల్ 11న జ్యోతి బాబుపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈనెల 15న తిరిగి నిర్వహించే సమావేశంలో అందరి సమక్షంతో ఉత్సవాల కమిటీని ఏర్పాటు చేసి కమిటీ ఆధ్వర్యంలో అన్ని కార్యాక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు చేయాలని నిర్ణయించారు.

ఇంటింటికీ తెలుగుదేశం

నిజాంపేట్: ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని టీడీపీ రాష్ట్ర నాయకుడు కాసాని వీరేశ్ ముదిరాజ్ అన్నారు. తెలంగాణ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఆదేశాల మేరకు శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

జాబ్ మేళాకు విశేష స్పందన





కూకట్‌పల్లి: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న జర్నలిస్టులు... నిరుద్యోగుల కోసం మెగా జాబ్ మేళాను నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో వివేక్‌నగర్‌లో శనివారం నిర్వహించిన జాబ్ మేళాను ప్రారంభించారు.